- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు
- మంత్రులు పట్టించుకోవడం లేదని రైతుల ఆగ్రహం
- జిల్లా డిమాండ్ 43,254 మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు వచ్చింది 28,921 మెట్రిక్ టన్నులే



సైదాపూర్ మండలం వెన్కేపల్లి సొసైటీ వద్ద సద్ది తెచ్చుకొని తింటున్న మహిళా రైతులు

మంత్రులూ.. యూరియా ఇప్పించరూ..

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అత్యధికంగా వరి దిగుబడి సాధిస్తున్న కరీంనగర్ జిల్లాలో నెలరోజులుగా యూరియా కోసం ఆందోళనలు కొనసాగుతున్నాయి. తెల్లవారు జాము నుంచే విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరుతున్న రైతన్నల గోడు పట్టించుకున్నవారే లేకుండా పోతున్నారు. పొలంలో ఒకరు యూరియా కోసం మరొకరు లైన్‌లో ఉంటున్నారు. రైతు దంపతులు సద్దికట్టుకొని వెళ్ళి లైన్లలో నిలబడుతున్నా బస్తా యూరియా దొరకడం లేదు. ఎప్పుడు వస్తుందో చెప్పేవారు లేరు. రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడి శరీరంలో శక్తి సన్నగిల్లి చెప్పులను లైన్లలో ఉంచి పడిగాపులు కాస్తున్నా ఫలితం లేకుండా పోతున్నది. కడుపుమండి ఆగ్రహంతో రైతన్నలు వారి కుటుంబసభ్యులు ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల వద్ద, యూరియా అమ్ముతున్న సెంటర్ల వద్ద ఆందోళనలకు దిగుతున్నారు.

● జిల్లాలో 2,76,500 ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో వానాకాలంలో 3,43,240 ఎకరాలలో వివిధ పంటలు సాగవుతాయని, అందులో ప్రధా నంగా వరి అత్యధికంగా 2,76,500 ఎక రాల్లో సాగవుతుం దని వ్యవసాయశాఖ అంచనా వేసింది. 48 వేల ఎకరాల్లో పత్తి, నాలుగు వేల ఎకరాల్లో మొక్కజొన్న, 1200 ఎకరాల్లో కందులు, పెసర, మరో వెయ్యి ఎకరాల్లో మిర్చి పంట లు సాగవుతాయని, మిగతా విస్తీర్ణంలో కూరగాయలు తదితర పంటలు సాగవుతాయని అంచనా వేశారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు చివరి వరకు 43,254 మెట్రిక్ టన్నుల యూరియా ఆయా పంటల సాగుకు అవసరమవ తుందని వ్యవసాయ శాఖ భావించి ఆ మేరకు కోటా విడుదల చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు 6,500 మెట్రిక్ టన్నులు, జూలై నుంచి సెప్టెంబరు వరకు 37,750 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవు తుందని కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. ఆయా నెలల వారిగా కోటా విడుదల చేయాలని

(మిగతా 8వ పేజీలో)

ఇన్‌చార్జి మంత్రి స్పందించరా..?

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును నియమించారు. ఆయన జిల్లాకు వచ్చి మొదటి సమీక్షా సమావేశంలో వ్యవసాయం, ఉద్యానవన, విద్యాశాఖలపైనే ప్రత్యేకంగా చర్చించారు. స్వయంగా రైతు అయిన తుమ్మల నాగేశ్వర్‌రావుకు వ్యవసాయంపై రైతుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉంది. ఆయన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నా రైతులు యూరియా సమస్య ఎదుర్కోవడం బాధాకరమని ప్రతిపక్షాలు అంటున్నాయి. జిల్లా మంత్రులు ఆయన దృష్టికి ఈ సమస్యను తీసుకవెళ్లక పోవడం కూడా కొంత కారణం కావచ్చనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● ముగ్గురు మంత్రులున్నా..

మంత్రులెవరూ తమ గోడు పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ముగ్గురు మంత్రులు ఉన్నారు. వీరు రాష్ట్ర మంత్రివర్గంలో క్రియాశీల పాత్ర వహిస్తున్నారన్న పేరున్నా జిల్లా ప్రజలు మాత్రం వారిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

● మంత్రి పొన్నం ప్రభాకర్, క్రిబ్‌కో సంస్థకు డైరెక్టర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. నిత్యం ప్రజా క్షేత్రంలోనే ఉండే మంత్రి పొన్నం జిల్లాలో జరుగుతున్న రైతు ఆందోళనల విషయంలో స్పందించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. యూరియా విషయంలో వ్యవసాయ అధికారులు, జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన మేరకు తెప్పించేందుకు చర్యలు తీసుకోక పోవడంపై రైతులు ఆగ్రహం, నిరసనలను వ్యక్తం చేస్తున్నారు. క్రిబ్‌కో డైరెక్టర్‌గా ఉన్న ఆయన చెబితే ఆ సంస్థ నుంచి యూరియా రాకుండా పోతుందా అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

● మరో మంత్రి శ్రీధర్‌బాబు రైతుల సమస్యల విషయంలో స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఐటీ శాఖ మంత్రిగా ఆయన నిత్యం వివిధ కార్యక్రమాల్లో బిజీగా గడుపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో యూరియా దొరకక రైతులు పడుతున్న ఇబ్బందులు, చేస్తున్న ఆందోళనలు ఆయన దృష్టికి రావడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.

● మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కొత్తగా బాధ్యతలు చేపట్టినా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తిగా అన్ని సమస్యలు తెలిసినా తమను పట్టించుకోవడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆయన కూడా తమ సమస్యకు ఏ మార్గం చూపడం లేద ని విమర్శిస్తున్నారు. యూరియా కోసం రైతులు అష్ట కష్టాలు పడుతూ ధర్నాలకు, ఆందోళనలకు దిగుతున్నా మంత్రుల దృష్టికి పోవడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.

● నిల్వ చేసుకుంటున్నారా..?

వరి నాటు వేసే వరకు ఎకరానికి రెండు బస్తాలు (90కిలోలు), ఆ తర్వాత పొట్ట దశలో మరో రెండు బస్తాలు (90 కిలోలు) యూరియా వాడతారు. 2,76,500 ఎకరాల వరి సాగుకు నాటు వేసే వరకు ఈ లెక్కన 24,885 మెట్రిక్ టన్నుల యూరియా, పొట్ట దశలో మరో 24,885 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుంది. మొత్తంగా 50వేల మెట్రిక్ టన్నుల యూరియా వరిసాగుకే అవసరమవుతుంది. మిగతా పంటల సాగుకు వినియోగించే యూరియా దీనికి అదనంగా అవసరముంటుంది. మార్కెట్‌లో ప్రస్తుతం యూరియా అందుబాటులో లేక పోవడంతో వరి పొట్ట దశకు వచ్చేసరికి ఇదే పరిస్థితి ఉంటే ఎలా అని ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు ఇప్పుడే అవసరమైన యూరియా మొత్తం కొనుక్కుని నిలువ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది కూడా యూరియా ఆందోళనకు కొంత కారణమవుతున్నది.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశా ఫెసిలిటేటర్స్‌తో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిజేరియన్ కాన్పుల వల్ల భవిష్యత్‌లో ఏర్పడే అనారోగ్య సమస్యల గురించి గర్భిణులు, వారి కుటంబ సభ్యులకు తెలియచేయాలని సూచించారు. గర్భంతో ఉన్న సమయంలో వారికి ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే డాక్టర్ల ద్వారా వారికి చికిత్స అందించి నార్మల్ డెలివరీల కోసం ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో మహిళలకు వంద శాతం స్క్రీనింగ్ పూర్తి చేసి, తిరిగి వారికి రీ స్క్రీనింగ్ చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధా, పీవోడీటీటీ డాక్టర్ ఉమాశ్రీ, ఎంసీహెచ్ పీవో డాక్టర్ సనజవేరియా, డెమో రాజగోపాల్, డీపీహెచ్‌ఎన్‌వో విమల, స్వామి, శ్రీనివాసులు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజీకి అవకాశమున్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించాలి

● పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



మాట్లాడుతున్న పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజీకి అవకాశమున్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కారించాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అధికారులకు సూచించారు. కమిషనరేట్‌లోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో సీపీ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 13న జరగబోయే లోక్ అదాలత్‌పై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ నేరాల్లో నేరస్థులు కొల్లగొట్టిన డబ్బులను తిరిగి బాధితులకు అందించేందుకు కృషి చేయా లన్నారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సీపీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ శ్రీనివాస్‌జి, సీసీఆర్‌బీ సీఐలు సరిలాల్, తిరుమల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది బుధవారం నాలుగు వేల క్యూసెక్కుల నీరు గేట్ల ద్వారా, కాకతీయ కాలువ ద్వారా 4,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 309 క్యూసెక్కులతో మొత్తం 8,809 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉంది. డ్యాంలోకి 8,809 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎల్ఎండీ పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలకు ప్రస్తుతం 23.516 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సేవా పక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

తిమ్మాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి తలపెట్టిన సేవా పక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, సేవా పక్వాడ రాష్ట్ర కన్వీనర్ మల్క కొమురయ్య పిలుపునిచ్చారు. అలుగునూర్‌లో సేవా పక్షం జిల్లా కార్యాశాల బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్క కొమురయ్య మాట్లాడుతూ ఈ నెల 17న జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలో రక్తదాన శిబిరాలను నిర్వహించాలన్నారు. 18న స్వచ్ఛ భారత్ కార్యక్రమం, ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ అంశాలపై మహిళా మోర్చా ఆధ్వర్యంలో అసెంబ్లీ స్థాయిలో కార్యక్రమాలు, చిత్రలేఖనం లాంటి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. 21న యువ మోర్చా ఆధ్వర్యంలో నమో మారథాన్‌ను చేపట్టి, యువత విద్యార్థులను ఈ కార్యక్రమాల్లో భాగస్వాములుగా చేయాలన్నారు. 25న దీన్‌దయాళ్‌కు నివాళులు అర్పించడం, బూత్ స్థాయిలో మొక్కలు నాటడం, జిల్లా స్థాయిలో మేధావులతో సమావేశం, డాక్యుమెంటరీ ప్రదర్శన, ఖాదీ స్టాల్ సందర్శన కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. 27న అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలలో దివ్యాంగులకు సన్మానం, ఉపకరణాలు పంపిణీ చేపట్టాలన్నారు. 2న మహాత్మాగాంధీకి, లాల్ బహదూర్‌శాస్త్రికి నివాళులు, పుష్పాంజలి అర్పించడం, ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయడంలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్సీ మల్క కొమురయ్య సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, సేవా పక్వాడ జిల్లా కన్వీనర్ ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభక్క, జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ, మాజీ మేయర్లు సునీల్‌రావు, డి శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల రమేష్, వాసాల రమేష్, కన్నెబోయిన ఓదెలు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం వాసుదేవరెడ్డి, నాయకులు దుర్శెట్టి సంపత్, గుర్రాల నిర్మల దేవి, బొంతల కళ్యాణ్ చంద్ర, అలివేలు, సమ్మిరెడ్డి, రఘు, దండు కొమురయ్య పాల్గొన్నారు.



:అలుగునూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

ఆక్రమణలపై 'బల్దియా' ఫోకస్

- కొత్తగా మరి కొన్ని వెండింగ్ జోన్ల ఏర్పాటు
- రెడ్ జోన్లలో వీధి వ్యాపారాలకు బ్రేక్
- ఇకపై రోజూ నగరంలో స్పెషల్ డ్రైవ్



వేంకటేశ్వర ఆలయం వద్ద రోడ్డుపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలతో ట్రాఫిక్ రద్దీ(ఫైల్)

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లను యథేచ్ఛగా ఆక్రమించుకొని చేస్తున్న వ్యాపారాలతో నిత్యం ప్రజలు ముఖ్యంగా వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇన్నాళ్లు అడపాద డపా ఆక్రమణలను తొలగిస్తూ వచ్చిన నగరపాలక సంస్థ ఇకపై ఆక్రమణలు లేకుండా చేయడంతోపాటు వీధివ్యాపా రులకు ఖాళీగా ఉన్న మార్కెట్, వెండింగ్ జోన్లలో స్థలాలను కేటాయించాలని నిర్ణయించింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలకు చెక్‌పడే విధంగా కార్యాచరణ రూపొందించి మార్గనిర్దేశనం చేశారు.

● మూడు జోన్లుగా రద్దీగా ఉండే ప్రాంతాలు

నగరంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలను రెడ్, గ్రీన్, అంబర్ జోన్లుగా విభజించనున్నారు. ఆయా జోన్లపై వీధివ్యాపారులకు అవగాహన కల్పించి, ఆక్రమణలకు పూర్తిగా చెక్‌పెట్టాలని, వీధి వ్యాపారులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని నిర్ణయించారు. ఇకపై గ్రీన్ జోన్ ప్రాంతాల్లో మాత్రమే వీధివ్యాపారులు వ్యాపారం చేసుకు నేందుకు అవకాశం కల్పించడమే కాకుండా అంబర్ జోన్‌లో రద్దీ లేని సమయంలో వ్యాపారాలకు అనుమతిని స్తారు. రెడ్ జోన్లలో రోడ్లు, ఫుట్ పాత్‌లపై ఎలాంటి క్రయవిక్రయాలు జరుగకుండా చర్యలు తీసుకుంటారు. గతంలో కూడా ఇలాగే రెడ్, గ్రీన్, అంబర్ జోన్‌లతో పాటు లిట్టర్ ఫ్రీ జోన్లను ప్రకటించి బోర్డులు ఏర్పాటు చేసి కొద్దిరోజులపాటు రోడ్లపై ఆక్ర మణలు లేకుండా చర్యలు చేపట్టారు. ఆ తర్వాత యథావిధిగా ఆక్రమణలు కొనసాగు తున్నాయి. ఈసారి గతంలో ఏర్పాటు చేసిన వెండింగ్ జోన్లతోపాటు ప్రస్తుత రద్దీని దృష్టిలో పెట్టుకొని కొత్తగా మరికొన్ని ప్రాంతాలను రెడ్, గ్రీన్, అంబర్ జోన్‌లుగా ఏర్పాటు చేశారు.

● రెడ్, గ్రీన్, అంబర్ జోన్లలో సైన్ బోర్డులు ఏర్పాటు

రెడ్, గ్రీన్, అంబర్ జోన్లలో టౌన్‌ప్లానింగ్ అధికారులు సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తారు. గతంలో గుర్తించిన గ్రీన్ జోన్ ప్రాంతాలు చైతన్యపురి, సప్తగిరికాలనీ, ఇందిరానగర్ మార్కెట్లతోపాటు ఆర్టీసీ బస్టాండ్ వెనుక, సివిల్ హాస్పిటల్ ప్రాంతం, శాతవాహన యూనివర్సిటీ సమీపంలో వీధి వ్యాపారులు వ్యాపారాలు చేసుకోవచ్చు. వారికి ఈ విషయాలపై అవగాహన కల్పిస్తారు. రెడ్ జోన్లలో ఫుట్‌పాత్ ఆక్రమణలను వెంటనే తొలగించి గుర్తింపు కార్డు ఉన్న వీధి వ్యాపారులకు నిర్మించిన మున్సిపల్ వాణిజ్య సముదాయాలు, మార్కెట్లలో వ్యాపారం చేసుకునేందుకు స్థలాలను కేటాయిస్తారు. ఫుట్‌పాత్, రోడ్డుపై ఉన్న ఆక్రమణలను మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, పోలీసు అధికారులు సమన్వయంతో ప్రతిరోజు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు.

● జోన్ల వివరాలు

● కోర్టు చౌరస్తా నుంచి డీమార్ట్ చౌరస్తా వరకు, మంచిర్యాల చౌరస్తా నుంచి అపోలో ఆసుపత్రి వరకు, టెలిఫోన్ క్వార్టర్స్ నుంచి బ్రిలియంట్ స్కూల్ వరకు గల రోడ్లను రెడ్ జోన్‌గా ప్రకటించారు. ఈ ప్రాంతాల్లో వీధివ్యాపారులు రోడ్లపై కూర్చొని వ్యాపారాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

● అంబర్ జోన్ ప్రాంతాలుగా టవర్ సర్కిల్ నుండి నేత బజార్, ఫెస్టివల్ స్ట్రీట్ మార్కెట్ (శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఎదుట) నుంచి కల్పన హోటల్ వరకు ప్రకటించారు. ఈ ప్రాంతంలో నిర్ణయించిన సమయం ప్రకారమే వ్యాపారులు రోడ్లపై వ్యాపారం చేసుకోవాలని, వేళలపై వారికి అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

● గ్రీన్ జోన్లుగా గుర్తించిన పద్మనగర్ సమీకృత మార్కెట్, బీట్ మార్కెట్, కాశ్మీరుగడ్డ రైతుబజార్ ప్రాంతాల్లో వీధివ్యాపారులు తమ వ్యాపారం చేసుకోవచ్చు. జోన్లపై వీధివ్యాపారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పూర్తి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

ఆస్తిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మున్సిపల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో మున్సిపల్ ఆర్‌వో, ఆర్‌ఐ, వార్డు ఆఫీసర్లతో సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో దాదాపు 32వేల కమర్షియల్ విద్యుత్ మీటర్లు ఉన్నాయని, ఆ మీటర్లు ఉన్న భవనాలను కమర్షియల్ కేటగిరిలోకి మార్చాలని ఆదేశించారు. విలీన గ్రామాలు (డివిజన్ల)లోని ఇంటి నంబర్ల అసెస్మెంట్లను ఆన్‌లైన్ చేసే ప్రక్రియను వీలైనంత వేగంగా పూర్తి చేయాలన్నారు. ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు ఉన్న వాటిని గుర్తించి తొలగించాలని, కూల్చివేసిన నివాస గృహాల పన్నులను చెల్లించకుంటే ఆ ఇంటి నంబర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. మున్సిపల్ దుకాణాల అద్దె ఒప్పందం పూర్తయితే వాటికి మళ్లీ బహిరంగ వేలం ద్వారా దుకాణాలను అద్దెకిచ్చేందుకు పూర్తి వివరాలతో రికార్డులను సిద్ధం చేయాలన్నారు. వార్డు ఆఫీసర్లు డివిజన్లలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, పారిశుధ్య పనులను ప్రతిరోజు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు కార్మికుల హాజరును బయోమెట్రిక్‌లో నమోదు చేయాలని, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని అధికారులు, ఉద్యోగులను హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

● భయపెడుతున్న వైరల్ ఫీవర్లు



హుజూరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న రోగులు

హుజూరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ డివిజన్‌లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగ్యూ, వైరల్ జ్వరాలతో రోజు రోజుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోజు వర్షాలు పడుతుండడంతో దోమలు పెరిగి జ్వరాలు సోకుతున్నాయి. పది రోజులుగా జలుబు, దగ్గు, తీవ్ర జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వద్ద జనం క్యూకడుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులు వైద్య పరీక్షల పేరిట అడ్డగోలుగా చార్జీలు వసూలు చేస్తున్నారు. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య లోపంతో జ్వరాలు పెరుగుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లోకి అడపాదడపా వస్తున్నారని గ్రామస్థులు అంటున్నారు.

● రోగులతో ఆస్పత్రులు కిటకిట...

విష జ్వరాలతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రజలు పరుగులు పెడుతుండడంతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య లోపం, దోమల బెడదతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. టైఫాయిడ్, డయేరియా, సాధారణ జ్వరాలు, జలుబు, దగ్గు సోకిన రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగతోంది. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు సక్రమంగా లేకపోవడం.. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లితే అధిక ఫీజులతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

దివ్యాంగులకుఅండగా ఉంటాం
● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ 7

యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యం
● వీసీ ఉమేష్‌కుమార్ 6

వణికిస్తున్న వానరాలు.. పరుగులు పెట్టిస్తున్న శునకాలు..

- కూరగాయలు, పంట చేలు ధ్వంసం
- దాడులతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న ప్రజలు

మంథనిరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంథనిలో కోతులు, కుక్కలతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. కుక్కలు, కోతులు వీధులలో గుంపులు, గుంపులుగా తిరుగుతూ దాడులకు పాల్పడుతతండ టంతో ప్రజలు గాయాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. మంథని



ఇళ్లల్లోకి వచ్చిన కోతులు

పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. కోతుల కారణంగా ఇండ్ల పైకప్పులు, కూరగాయల మొక్కలు, పండ్ల చెట్లు దెబ్బ తింటున్నాయని ప్రజలు వాపోతున్నారు. షాపుల్లోకి, ఇళ్లలోకి చొరబడి సామగ్రిని ఎత్తుకుపోతున్నాయి. అడ్డుకోవటానికి ప్రయత్నిస్తే దాడికి యత్నిస్తున్నాయని వాపోతున్నారు. కోతుల గుంపు వచ్చిందంటే కొన్ని గంటల పాటు నరకమేనని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మరోవైపు కుక్కలు కూడా గుంపులు, గుంపులుగా తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నాయి. కోతులు, కుక్కలు కారణంగా పాఠశాలల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, పనుల కోసం బయటకు వెళ్లే మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. తమ వెంట కర్ర పట్టుకొని వెళ్లతున్నారు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారు, క్రీడాకారులు మైదానానికి రావాలంటే జంకుతున్నారు. ఆగస్టు నెలలో మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో కోతుల



మంథని వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

దాడిలో 156, కుక్కలదాడిలో 42మంది. ఈ నెలలో 52మంది కోతులు, కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా మంథని మున్సిపాల్, అటవీశాఖ, గ్రామ పంచాయతీల అధికారులు స్పందించి వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ ఏర్పాట్లపై సమీక్ష



ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించనున్న బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభకు జన సమీకరణ, సభ ఏర్పాట్లపై బుధవారం హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. బేగంపేట టూరిజం ప్లాజాలో ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జన సమీకరణ, సభ ఏర్పాట్లపై చర్చించారు. ఒక్కో జిల్లా నుంచి 15 వేల మందిని కామారెడ్డి సభకు తరలించాలని నిర్ణయించి సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జిలకు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాల్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారయణ, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్లు సత్తు మల్లేశం, నాగుల సత్యనారాయణగౌడ్, నేరెళ్ల శారద, కేకే మహేందర్‌రెడ్డి, ప్రణవ్‌బాబు, ఖైచాల రాజేందర్‌రావు, బొమ్మ శ్రీరాంచక్రవర్తి పాల్గొన్నారు.

గంభీరావుపేటలో వైరల్ ఫీవర్

- జ్వర బాధితులతో నిండిన ఆసుపత్రి



గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వర పీడితులు

గంభీరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలాన్ని వైరల్ ఫీవర్ వణికిస్తోంది. ప్రధానంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి జ్వర పీడితులతో నిండిపోయింది. మూడు నాలుగు రోజుల నుంచి జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. తీవ్రమైన తలనొప్పి, కాళ్లనొప్పులతో పాటు జలుబు, జ్వరంతో ఆసుపత్రికి వందల సంఖ్యలో వస్తున్నారు. ఓ వైపు జ్వర పీడితుల సంఖ్య పెరుగుతుండటం మరోవైపు సరిపడా బెడ్లు లేకపోవడం కొంత సమస్యగా మారింది. దీంతో కొందరికి రక్త పరీక్షలు నిర్వహించడం, మరికొందరికి మందులు ఇచ్చి పంపిస్తూ, రక్త పరీక్షలకు మరుసటి రోజు రావాలని సూచిస్తున్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



రాజేష్‌యాదవ్(ఫైల్)

జైపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని అక్బర్‌నగర్‌కు చెందిన రాజేష్ యాదవ్ మృతదేహం లభ్యం అయినట్టు ఎస్సై శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఆరో తేదీన గణపతి నిమజ్జనంలో ప్రమాదవశాత్తూ ఇందారం గోదవరి బ్రిడ్జిపై నుంచి కాలుజారి గోదావరి నదిలో పడి గల్లంతయ్యాడు. బుధవారం రాజేష్‌యాదవ్ మృతదేహం లభించింది. మృతదేహం మండలంలోని శివ్వారం గోదావరి పరివాహక ప్రాంతం నది ఒడ్డున మృతదేహం కనిపించగా స్థానిక రైతులకు తమకు సమాచారం అందించారని తెలిపారు. దీంతో అక్కడకు వెళ్లి రాజేష్ యాదవ్ మృతదేహంగా గుర్తించామన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన గొల్లపల్లి వెంకవ్వకు చెందిన రెండు తులాల పుస్తెల తాడును బుధవారం దొంగలు అపహరించుకొని వెళ్లినట్లు బాధితురాలు వెంకవ్వ తెలిపారు. మధ్యాహ్నం వెంకవ్వ మెడలో నుంచి ఇద్దరు ద్విచక్ర వాహనదారులు పుస్తెల తాడును లాక్కొని వెళ్లినట్లు తెలిపారు. బాధితురాలి కుమారుడు లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వెంకట్రావుపల్లెలో కొనసాగుతున్న 144 సెక్షన్

ముస్తాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో 144 సెక్షన్ కొనసాగుతోందని ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ప్రభుత్వ స్థల విషయంలో ఓ వర్గానికి, గ్రామస్థులకు మధ్య జరుగుతున్న వివాదంతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు గ్రామంలో పోలీసులు బందో బందుబస్తు ఏర్పాటు చేశారు. ధర్నా చేసిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యం

- శాతవాహన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటు
- విరాళాలు ప్రకటించిన ఎన్‌ఆర్‌ఐలు
- వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యమని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కూమార్ తెలిపారు. బుధవారం యూనివర్సిటీ సెమినర్ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ అమెరికా పర్యటనలోని వివరాలను వెల్లడించారు. 2008లో స్థాపించిన యూనివర్సిటీ భిన్న కోర్సులు, నాలుగు పీజీ సెంటర్లతో తెలంగాణలోని ప్రముఖ విశ్వవిద్యాలయంగా పేరు తెచ్చుకునేందుకు ముందుకుసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఉపకులపతి శాతవాహన ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేశా మని, అమెరికా వెళ్లి అక్కడి నుంచి శిక్షణ, పరిశోధన, మెరుగైన అవకాశాల కోసం ఎన్నారైల నుంచి విరాళాలు సేకరించామన్నారు. సాంకేతిక అభివృద్ధి కోసం కంప్యూటర్లు, డిజిటల్ పరికరాలకు సహాయం చేశారన్నారు. పీజీ విద్యార్థుల స్నాతకోత్సవానికి బంగారు పతకాలను అందజేశారన్నారు. బోస్టన్ నగరంలో మీట్ అండ్ గ్రీట్ ద్వారా తెలంగాణ ఎన్నారై సంఘం బోస్టన్ చాప్టర్ రూ.3 లక్షల విరాళం ఇచ్చినట్లు చెప్పారు. డాక్టర్ దివాకర్ జాన్డియం, కోట సుమన్ రెడ్డి రూ.2లక్షల చొప్పున బంగారు పతకాలు అందజేశారన్నారు.



వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్

హూస్టన్ నగరంలో జితేందర్ రెడ్డి రూ.లక్ష, డాక్టర్ రాజశేఖర్ ఎలమంచిలి వెయ్యి డాలర్లు, అనురాధ, డాక్టర్ రమేష్ చర్విరాల రూ.2 లక్షల బంగారు పతకాన్ని అందజేశారని తెలిపారు. షార్లెట్‌లో కృష్ణ కాదరి రూ.లక్ష, దామోదర్ రెడ్డి రూ.50 వేలు ఇచ్చినట్లు చెప్పారు. ఫిలడెల్ఫియాలో కర్ర సుభాష్‌రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకాన్ని అందజేశారని, న్యూయార్క్‌లో సుధాకర్‌రావు విదియాల హెచ్‌పీఎల్‌సీ పరికరం, రూ.2 లక్షల బంగారు పతకం, ఏటా కెమిస్ట్రీ విద్యార్థికి రూ.లక్ష నగదు బహుమతి, హైదరాబాద్ ప్లాంట్‌లో ఐదుగురు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సదుపాయాలు కల్పించారన్నారు. న్యూ జెర్సీలో డాక్టర్ బండారి సుధాకర్ 10 కంప్యూటర్లను, ప్రదీప్ సువర్ణ రూ.2 లక్షల బంగారు పతకం, డాక్టర్ మనోహర్ శ్రీరామోజి రూ.2లక్షల బంగారు పతకం ఐదు సంవత్సరాల వరకు అందజేస్తామన్నారని తెలిపారు. డాక్టర్ కిషోర్ భూపతి రూ.2 లక్షల, శరత్‌రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకాలు అందజేశారన్నారు. వాషింగ్టన్ డీసీలో జనేత రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకం లా విద్యార్థుల కోసం అందజేసినట్లు చెప్పారు. నవంబరు రెండో వారంలో విశ్వవిద్యాలయంలో రెండోసారి స్నాతకోత్సవాలను నిర్వహిస్తామని, ఇందులో విద్యార్థులకు బంగారు పతకాలు, నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఎన్నారైల సహకారంతో శాతవాహన విశ్వవిద్యాలయాన్ని తెలంగాణలోనే మొదటి వరుసలో నిలపడానికి ప్రయత్నం చేస్తామని,వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

వృద్ధురాలి ఫిర్యాదుపై విచారణ చేపట్టిన అధికారులు



అమృతమ్మను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

ఇల్లందకుంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగంపాడు గ్రామానికి చెందిన కళ్లెం అమృతమ్మ ఫిర్యాదుపై అధికారులు బుధవారం విచారించారు. అమృతమ్మ భర్త చిన్న రాజిరెడ్డి పదేళ్ల క్రితం మృతి చెందాడు. భర్త మృతి చెందిన తర్వాత కొడుకులిద్దరూ తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి నుంచి ఎలాంటి జీవనభృతి లేకపోవడం వల్ల ఎడ్ల దొడ్డిలో జీవనం సాగిస్తున్నారు. కొడుకులు తనను పట్టించుకోవడం లేదని అమృతమ్మ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు గిర్దావర్ నాగరాజు, కానిస్టేబుల్ రాజేష్, మహిళ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ జ్యోతి, సఖి కౌన్సిలర్ పద్మావతి, డీహెచ్‌హెడ్ జెండర్ స్పెషలిస్టు కవితలు బోగంపాడు గ్రామంలోని అమృతమ్మ ఉంటున్న గుడిసెను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొడుకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అధికారులు పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి అందించనున్నట్లు తెలిపారు.

గర్షకుర్తి మరమగ్గాలపై విజిలెన్స్ తనిఖీలు

గంగాధర, సెప్టెంబరు 110 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం గర్షకుర్తి పవర్ లూమ్స్‌పై బుధవారం విజిలెన్స్ అధికారులు దాడీ చేశారు. జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంటు ఏడీ అనిత ఆధ్వర్యంలో చెన్నయ్‌కి చెందిన అధికారుల బృందం దాడీ చేశారు. మర మగ్గాలపై కలర్ చీరలు తయారు చేస్తున్న గర్షకుర్తికి చెందిన మిట్టపల్లి వెంకటేశ్ మగ్గాలపై దాడులు చేసి కేసు నమోదు చేసి, దూస వెంకటేశ్‌ల మరగ్గాలపై దాడులు చేసి రంగుల చీరలు తయారు చేస్తుండగా కోసివేశారు. పాత జీవో ప్రకారం కలర్ చీరలు తయారు చేయవద్దని ఆర్డర్లు ఉన్నప్పటికీ కార్మికులు వాటిని తయారు చేస్తుండగా కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. గ్రామంలో మగ్గాలను పరిశీలిస్తూ కలర్ చీరల తయారీ కార్మికులను బెంబేలెత్తించారు.



మగ్గాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని మైత్రి హోటల్ వద్ద ఈ నెల 7న సాయంత్రం డబ్బుల విషయంలో నిష్టూరి యశ్వంత్, ముద్దుల మధును కారులో కిడ్నాప్ చేసి, బెదిరించి డబ్బులు తీసుకున్న కేసులో నిందితులను బుధవారం అరెస్టు చేశామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఈ కేసులో నల్లపాటి నరేష్, గుడిమల్ల సివిల్, తునికిపాటి శేఖర్, ఆలకుంట ఉపేందర్, ఆలకుంట అశోక్‌ను అరెస్టు చేశామని పేర్కొన్నారు. రెండు కార్లు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసుతో సంబంధమున్న మరికొందరి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

గణేష్ చందా ఇవ్వలేదని కుల బహిష్కరణ

- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో గణేష్ చందా ఇవ్వలేదని కుల బహిష్కరణ చేశారని బాధితులు బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్లెడ గ్రామంలో గణేష్ నవరాత్రులకు సంబంధించిన చందా ఇవ్వకపోవడంతో తమ నాలుగు కుటుంబాలను కులం నుంచి వెలివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలతో ఎవరూ మాట్లాడకూడదని షరతులు విధించారన్నారు. ఎవరైనా మాట్లాడితే రూ.25 వేల జరిమానా విధిస్తామని కుల పెద్దలు హెచ్చరించినట్లు బాధితులు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

హైనా దాడిలో శునకం మృతి

మల్యాల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గల సివిల్ సప్లై గోదాం వద్ద వన్యప్రాణి హైనా దాడిలో శునకం మృతి చెందింది. బుధవారం గోదాంల వద్ద శునకం మృతి చెందడాన్ని గోదాం సిబ్బంది గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. మంగళవారం అర్ధరాత్రి వన్యప్రాణి ఈ ప్రాంతంలో సంచరించినట్లు ఇక్కడ లభించిన ఆనవాళ్ల మేరకు హైనాగా అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. హైనా సంచారం స్థానికులను ఆందోళనకు గురి చేస్తోంది.

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై కేసు నమోదు

వీణవంక,సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డిపై ఆధారాలు లేకుండా సోషల్ మీడియా వాట్సాప్ గ్రూపులలో అనుచిత వాక్యలు చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు పోస్టులు పెట్టడంతో మండల సోషల్ మీడియా కో అర్డినేటర్ బావు రాకేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రెండు పార్టీల మధ్య గొడవలు జరిగేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బీఆర్ఎస్ నాయకులు కామిడి శ్రీనివాస్ రెడ్డి,బండా కిషన్ రెడ్డి,ఖుర్షుల చరణ్ రావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ఎవరైనా సోషల్ మీడియాలో ఇతరులకు భంగం కలిగేలా శాంతిభద్రతలకు ఇబ్బంది కలిగేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వారితో సామాజిక సేవ

- ఆస్పత్రిలో పండ్లు .. విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ
- గోదావరిఖని కోర్టు ఆదేశాలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో పరివర్తన తీసుకువచ్చేందుకు గోదావరిఖని కోర్టు జరిమానాలతో పాటు సామాజిక సేవ చేయాలనే ఆదేశాలనిచ్చింది. బుధవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట్ సచిన్‌రెడ్డి అంతర్గాం, ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన 8మంది మందు బాబులకు ఒక్కొక్కరికి రూ.2వేల నుంచి రూ.4వేల జరిమానా విధించడంతో పాటు సామాజిక సేవలను శిక్షలుగా విధించారు. జడ్జి ఆదేశాల మేరకు కోర్టు కానిస్టేబుళ్లు రవికుమార్, బుర్ర శ్రీనివాస్ శిక్షలు అమలు చేయించారు.

ప్రభుత్వాసుపత్రి, పాఠశాల ఆవరణలను శుభ్రం చేయడం, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, విద్యా ర్థులకు నోట్ పుస్తకాల పంపిణీతో పాటు గాంధీనగర్‌లోని ఇందిరమ్మ సర్కిల్ వద్ద మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ట్రాఫిక్ విధులు నిర్వహించారు.



మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకులు

చెరువులో పడి వృద్ధురాలు మృతి

గంభీరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట నమాజ్ చెరువులో మారవేణి మల్లవ్వ(68) అనే వృద్ధురాలు పడి మృతిచెందింది. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన మల్లవ్వ సమీప నమాజ్ చెరువులో అదేరోజు రాత్రి శవమై కనిపించింది. మల్లవ్వకు మానసిక పరిస్థితి బాగాలేకనే చెరువులో పడి చనిపోయిందని మృతురాలు బంధువులు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు మల్లవ్వ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా మల్లవ్వ దొరకలేదు. అదేరోజు రాత్రి 10 గంటల ప్రాంతంలో సమీప నమాజ్ చెరువులో మల్లవ్వ శవమై కన్పించింది. మానసిక పరిస్థితి బాగాలేకనే మల్లవ్వ చెరువులో పడి ఊపిరి ఆడక చనిపోయిందని మృతురాలు కొడుకు సాయిలు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షా 15 వేల కోట్లు దోచుకున్న కేసీఆర్

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి లక్షా 50 వేల కోట్లు ఖర్చయినట్లు కేసీఆర్ చెప్పారని, వాస్తవంగా 35 వేల కోట్లు ఖర్చవగా మిగతా లక్షా 15 వేల కోట్లు కేసీఆర్ కుటుంబం దోచుకుందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కోటి 40 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయని, రక్తం దారపోసి కర్త, కర్మ, క్రియ, ఇంజనీరుగా అన్ని తానై కట్టినట్లు చెప్పారని అన్నారు. ప్రాజెక్టు అవినీతి, అక్రమాలపై జస్టిస్ గోష్ కమిషన్ చేసిన విచారణ అనంతరం నివేదికలో వాస్తవాలు బయటపడ్డాయన్నారు. జస్టిస్ గోష్ కమిషన్ నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు అందజేశారన్నారు. లక్ష 15 వేల కోట్లు అవినీతి జరిగిందని, కానీ ఇందులో తనకు ఎలాంటి సంబంధమూ లేదని, ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత మొత్తం కేసీఆర్ తీసుకున్నారని నాటి ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు గోష్ కమిషన్‌కు స్పష్టం చేస్తూ లిఖితపూర్వకంగా రాసిచ్చారన్నారు. ఈ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసి సీబీఐ విచారణ కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అందజేశారన్నారు. కేసీఆర్ దోచుకున్న లక్ష 15 వేల కోట్ల రూపాయలు తెలంగాణ ప్రజల కష్టార్జితమన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగింది వాస్తవమని, కానీ ఆ అవినీతిని చేసింది మాత్రం నాడు ఇరిగేషన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల కాంతం

మంత్రిగా ఉన్న హరీష్‌రావు మాత్రమేనని స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇసుక వ్యాపారం చేసిన సంతోష్‌రావు అందులో వేల కోట్లు దోచుకున్నారని కవిత చెప్పిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. హరితహారం పేరుతో సంతోష్‌రావు వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారని ఇటీవల కవిత బహిరంగంగా చెప్పారన్నారు. కేసీఆర్ కూతురు కవిత స్వయంగా కాలేశ్వరంలో అవినీతి జరిగిందని చెబుతుంటే కేటీఆర్ సిగ్గు లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఫార్ములాఈ కేసులో అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికిన కేటీఆర్ ఇప్పుడు దానిపై లొట్ట పీసు కేసు అంటూ పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. నేరెళ్లలో ఇసుక మాఫియాపై ప్రశ్నించినందకు థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఏ పని చేసుకోని విధంగా కొట్టి వారి జీవితాలను నాశనం చేశారని స్వయంగా కవిత చెప్పారన్నారు. కేటీఆర్, హరీష్‌రావు, కవిత కోట్ల రూపాయలతో భవనాలు, ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారని, కేసీఆర్ 60 ఎకరాలలో ఉన్న ఫామ్ హౌస్ నేడు 600 ఎకరాలు అయ్యిందని అన్నారు. కేటీఆర్, హరీష్‌రావు, కవిత అమెరికా, దుబాయ్, సింగపూర్‌లలో వేల కోట్లు పెట్టుబడులకు డబ్బు ఎలా వచ్చిందో చెప్పాలన్నారు. ఆస్తుల పంపకాల్లో గొడవలతోనే కవిత ఇదంతా బయట పెట్టారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్‌లో నిజాం వారసులకు చెందిన 30 వేల ఎకరాల భూమిని కేటీఆర్, హరీష్‌రావు, సంతోష్‌రావు, కవిత కబ్జా చేశారని, దీని కోసమే ధరణి తీసుకొచ్చారని అన్నారు. నిజాంకాలంలో నిర్మించిన సచివాలయం పునర్నిర్మాణంలో భాగంగా జరిపిన తవ్వకాల్లో బంగారం, పచ్చ రంగు వజ్రాలు బయటపడ్డాయని, వాటిని సమానంగా పంచాలని కవిత డిమాండ్ చేయడంతో ఆ కుటుంబంలో గొడవలు వచ్చాయని అన్నారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని యువకులు ఉద్యమాలు చేసి ప్రాణత్యాగాలు చేస్తే, చలించిపోయిన సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, కేసీఆర్ సీఎం అయ్యాక వారి ఇంట్లో నలుగురికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఈ నలుగురి ఉద్యోగాల తరువాత తెలంగాణ రూ.8 లక్షల కోట్ల అప్పుల పాలయ్యిందన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సముద్రాల అజయ్, కల్వల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పురోహితుడు అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పురోహితుడిగా కొనసాగుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన తివారి శైలేందర్ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శైలేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని ఓ గది అద్దెకు తీసుకుని స్థానిక ఆలయంలో పురోహితుడిగా కొనసాగుతున్నాడని తెలిపారు. మధ్యాహ్నం ఇంటి నుంచి ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలోని నారోజు రాజు బైక్‌పై వెళుతున్న క్రమంలో శైలేందర్ భార్య శైలతో పాటు కుటుంబ సభ్యులు అడ్డుకునేందుకు యత్నించారని చెప్పారు. వారి ద్విచక్రవాహనాన్ని వెంబడించి అతని స్నేహితులతో మాట్లాడుతున్న తరుణంలో శైలేందర్ అక్కడ నుంచి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో పాటు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆరా తీశారని తెలిపారు. ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. తన భర్త కనిపించకపోవడానికి కొండాపూర్ వాసి నారోజు రాజుపై అనుమానం ఉందని పేర్కొంటూ శైలేందర్ భార్య శైల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

వివాహిత మృతికి కారణమైన అత్త, బావలపై కేసు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి) : వివాహిత ఆత్మహత్యకు కారణమైన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని మృతురాలు అత్త ఈరవేణి లక్ష్మి, బావ సత్యనారాయణలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. గ్రామంలోని వివాహిత ఈరవేణి రమ్య తన అత్త లక్ష్మి, బావ సత్యనారాయణలు మానసికంగా వేధించడంతో మనస్థాపం చెంది ఈనెల 9న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఎల్లంపల్లికి.. బీఆర్ఎస్‌కు ఏం సంబంధం?

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

హైదరాబాద్ సెప్టెంబర్10 ,(ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి ప్రాజెక్టును తామే నిర్మించినట్టుగా బీఆర్ఎస్ నాయకులు తెగ ఊదర గొడుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. అసలు ఎల్లంపల్లి ప్రాజెక్టునకు బీఆర్ఎస్‌కు ఏం సంబంధం అని ఆయన ప్రశ్నించారు. బుధవారం సీఎల్పీ మీడియా సెంటర్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విలేకరులతో మాట్లాడుతూ ఎల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ మానస పుత్రికగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టునకు శంకుస్థాపన జరిగిందని, పనులు సైతం పూర్తి చేసినట్టు ఆయన స్పష్టం చేశారు. అయితే ఎల్లంపల్లి ప్రాజెక్టును తామేనిర్మించామన్నట్లుగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీష్‌రావు తెగ ఊదరగొడుతున్నారని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును ప్రారంభించిన పక్షంలో కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందన్న భయంతో ఇప్పటి వరకు అధికారికంగా ప్రారంభోత్సం చేయలేదన్నారు. ఒక వేళ ఎల్లంపల్లిని పూర్తి చేసిన పక్షంలో కేసీఆర్ ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. ఈ ప్రాజెక్టుతో పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, భూపాలపల్లి, మంచిర్యాల ప్రాంతాల్లోని 2.24 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అలాగే సింగరేణి, సింగరేణి విద్యుత్ సంస్థలకు ఇక్కడినుంచే నీటిని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. అబ్దుల్ కలాం సుజల స్రవంతి కింద 10 టీఎంసీలు గ్రేటర్ హైదరాబాద్‌కు పైప్‌లైన్‌ల ద్వారా తాగు నీటికోసం పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

లక్ష ఉద్యోగాలకు కట్టుబడిన కాంగ్రెస్ సర్కార్

● ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్ సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష మందికి ఉద్యోగాలు ఇస్తామన్న మాటకు కట్టుబడి ఉందని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ శాసనసభ్యుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. టీజీపీఎస్సీపై హైకోర్ట్ తీర్పులో కాంగ్రెస్ పార్టీని కానీ ప్రభుత్వాన్ని ఎక్కడ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, ఎలాంటి అవకతవకలు జరగలేదని పేర్కొన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు బతుకులను చీకట్లో నెట్టింది మీ పార్టీ, మీ నేత కేటీఆర్ కాదా. అని ప్రశ్నించారు. అవాకులు చెవాకులు పేలితే మాటలతో కాదు... చేతలతో చూపించాల్సి వస్తుందని మక్కాన్ సింగ్ ఠాకూర్ హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి యువత భవిష్యత్తుకు భరోసా అని స్పష్టం చేశారు. నిరుద్యోగులు బీఆర్ఎస్ నాయకుల రెచ్చగొట్టే మాటలు నమ్మవద్దని కోరారు. యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని , ఏ విద్యార్థికి నష్టం జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు.

ఏడుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా మద్యం మత్తులో న్యూసెన్స్ చేసిన ఏడుగురు యువకులను బైండోవర్ చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్‌కు చెందిన పైండ్ల అజయ్, తిరుపతి, స్వామి, సాయి కేశవ్, రాజేందర్, కుమార్, శ్రీనును బుధవారం స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

'న్యాయ నిర్మాణ్ భవన్'కు శ్రీకారం



● త్వరలో అద్దె భవనంలోకి మారనున్న నాలుగు కోర్టులు
● రాజన్న సిరిసిల్ల జిల్లాలో జీప్లస్ 4 అంతస్థులు.. 12 కోర్టులకు రూపకల్పన
● రూ.81.26కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): కక్షిదారుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో జిల్లా కోర్టు మోడల్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. సిరిసిల్ల పట్టణంలో 5.1ఎకరాల స్థలంలో జిల్లా కోర్టు భవన సముదాయాన్ని నిర్మించడానికి ప్లాన్ సిద్ధమైంది.ఇందులో భాగంగానే రోడ్డు, భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులు హైకోర్టు ఆదేశాల మేరకు జిప్లస్4 అంతస్తులతో 12కోర్టుల నిర్మాణానికి రూపకల్పన చేశారు. భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 81.26కోట్లు కేటాయించింది. నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణ పనులు ఈనెలాఖరులోగా చేపట్టేందుకు ముహూర్తం ఖరారైంది.

● నేలమట్టం కానున్న పాత భవనం

పాత తాలుకా కేంద్రమైన సిరిసిల్ల పట్టణంలో 1973లో మున్సిఫ్‌కోర్టును ప్రారంభించారు. 52సంవత్సరాల క్రితం పక్కా భవనంలో ఏర్పాటుచేసిన మున్సిఫ్ కోర్టు పాత భవనం నేలమట్టం కానుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాగా రూపాంతరం చెందిన తర్వాత సిరిసిల్లకు జిల్లా కోర్టు, 1వ అదనపు సెషన్స్ జిల్లా కోర్టుతో పాటు పోక్సో కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరయ్యాయి.ఈవిధంగా కోర్టుల సంఖ్య పెరగడంతో పాత భవనాలు సరిపోవడంలేదు. దీంతో ప్రభుత్వం జిల్లా కోర్టుసమీకృత భవన సముదాయం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

● అధునాతనంగా 'న్యాయ నిర్మాణ్ భవన్'

జిల్లాకేంద్రంలో అధునాతన పద్ధతిలో 'న్యాయ నిర్మాణ్ భవన్' సముదాయం నిర్మాణానికి సిద్ధం చేశారు. జీప్లస్4 విధానంలో భవన సముదాయాన్ని నిర్మించడానికి రూపకల్పన చేశారు. భవిష్యత్తులోనూ మరో రెండు అంతస్తులు నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో 12 కోర్టు హాళ్లు, ఆఫీసర్స్ చాంబర్స్, ప్రతి ఫ్లోర్‌లో బార్ అసోసియేషన్ హాలు, టాయిలెట్స్, కక్షిదారుల చాంబర్, విజిటర్స్ చాంబర్‌లను మోడల్ విధానంలో నిర్మించడానికి రూపొందించారు. ప్రతి ఫ్లోర్‌కు వెళ్లేందుకు కక్షిదారులకు ఒక లిఫ్ట్, న్యాయ వాదికారులకు ఒక లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. గ్రౌండుఫ్లోర్‌లో పూర్తిస్థాయిలో 88 కార్లు, 62బైక్‌లు పార్కింగ్ సౌకర్యం కల్పించడానికి నిర్ణయించారు. ఇందులో ప్రస్తుతం ఉన్న జిల్లా కోర్టు, 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు, పోక్సో కోర్టు, ఫ్యామిలీ కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు, 1వ అదనపు జూనియర్ సివిల్ కోర్టు, 2వ అదనపు జూనియర్ సివిల్ కోర్టులతోపాటు భవిష్యత్తులో మంజూరయ్యే మరో ఆరు కోర్టులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా న్యాయనిర్మాణ్ భవనాన్ని నిర్మించడానికి టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఈ టెండర్‌ను కెఎంవిఆర్ కంపెనీ దక్కించుకొని 24నెలల్లో పూర్తిచేయడానికి అగ్రిమెంట్ చేసుకొంది.

● ఈనెల 15న అద్దెభవనంలోకి కోర్టులు..

నూతన కోర్టు సమీకృత భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేయనుండడంతో ఈనెల 15న అద్దె భవనంలోకి మారనున్నాయి. మంగళవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జారీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సర్దార్‌నగర్‌లో గల ఓ భవనంలోకి మూడు కోర్టుల వ్యవహారాలు సాగుతాయి. ఇందులో పీడీఎం, ఏడీఎం, 2వ ఏడీఎం కోర్టులు ఉంటాయి. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో అద్దె భవనంలోకి సీనియర్ సివిల్ కోర్టు మారుతోంది. మిగతా జిల్లా కోర్టు, 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు, పోక్సో కోర్టులు ప్రస్తుతం ఉన్న బార్ అసోసియేషన్ హాలులోనే కొనసాగుతాయి.



తాత్కాలికంగా ఏర్పాటుకానున్న అద్దె బిల్డింగ్

అద్దె భవనంలోకి నాలుగు కోర్టులు..

- పీ. నీరజ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, రాజన్న సిరిసిల్ల జిల్లా



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అధునాతన పద్ధతులతో నూతన కోర్టు భవనం నిర్మాణానికి ముహూర్తం చేయనున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న నాలుగు కోర్టులు అద్దె భవనంలోకి మార్చుతాం. సువిశాలమైన స్థలంలో నిర్మించే ఈ భవనం నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుట్టేందుకు హైకోర్టు రూపకల్పన చేసింది.

నూతన భవన నిర్మాణానికి సిద్ధం..

- జూపల్లి శ్రీనివాసరావు, అధ్యక్షుడు, బార్ అసోసియేషన్, సిరిసిల్ల



జిల్లా కేంద్రంలో నూతన సమీకృత కోర్టు భవన నిర్మాణానికి సిద్ధం కావడం శుభపరిణామం. ఈ కోర్టు భవనం నిర్మాణానికి పలువురు హైకోర్టు న్యాయ మూర్తులను ఆహ్వానించేందుకు హైకోర్టుకు వెళ్లి వచ్చాం. ఈనెలాఖరులోగా నూతన కోర్టు భవనానికి శంకుస్థాపన కానుంది.

అరుణాచల యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు

భగత్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు కరీంనగర్-1 డిపో మేనేజర్ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. భాద్రపదశుద్ధ పౌర్ణమితో పాటు తీర్థయాత్రల టూర్‌లో భాగంగా ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ బస్టాండ్ నుంచి బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. 14న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ అదే రోజు అరుణాలచం చేరుకుంటుందని తెలిపారు. గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం 15వ తేదీ మధ్యాహ్నం బస్సు బయల్దేరి జోగులాంబ దర్శనం అనంతరం కరీంనగర్ చేరుకుటుందని పేర్కొన్నారు. పెద్దలకు రూ.4700, పిల్లలకు రూ.3540 చొప్పున ఛార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు 7382849352, 9959225920, 8074690491 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7450 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 82క్వింటాళ్లు విడి పత్తి, ఒక రైతు గోనె సంచుల్లో క్వింటాల్ పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7450 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

మానకొండూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన టప్ప వెంకటేశం(27) తన మోటార్ సైకిల్‌పై చెంజర్లకు వెళ్తున్నాడు. చెంజర్ల వద్ద మాలోతు శ్రీనివాస్ (37) మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా కరీంనగర్‌కు తరలించారు.

ముదిరాజ్‌లకు సముచిత హక్కులు కల్పించాలి



మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ నేత నీలం మధుముదిరాజ్



హాజరైన ముదిరాజ్ కులస్తులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముదిరాజ్‌లకు సముచిత హక్కులు కల్పించాలని, బీసీడీ నుంచి బీసీఏలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో టీఎంపీఎస్ ముదిరాజ్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న నిజామాబాద్‌లో నిర్వహించనున్న సభలో సీఎం, రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌ల బీసీ-ఏలో చేర్చడంపై ప్రకటన చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ముదిరాజ్‌లు అందరూ ఏకతాటిపై ఉన్నారని, స్థానిక ఎన్నికల్లో జిల్లాకు 30 మంది సర్పంచులను గెలిపించుకుంటామని అన్నారు. గత ప్రభుత్వం ముదిరాజ్‌లను నిర్లక్ష్యం చేసిందన్నారు. సీనియర్ నాయకులు మంద నగేష్ ముదిరాజ్, సుంకరబోయిన మహేష్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పరవేణి రంజిత్ ముదిరాజ్, సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కీసర సంపత్ ముదిరాజ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పిట్టల రవీందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ కుమార స్వామి ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు మామిడి తిరుపతి ముదిరాజ్, పురం రాజేష్ ముదిరాజ్, నిమ్మల కిషన్ ముదిరాజ్, ఎరవేణి రామాంజనేయులు ముదిరాజ్, జిల్లా కార్యదర్శి బాలెన్కి మల్లేష్ ముదిరాజ్, గట్టు శ్రీధర్ ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధులు మౌటం సంపత్ ముదిరాజ్, పిల్లి రవి ముదిరాజ్, బోయిని వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన కల్వకుంట్ల కుటుంబం

● అవగాహన లేకుండా మాట్లాడుతున్న కేటీఆర్ ● మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని రాష్ట్ర కార్మిక శాఖ, ఉపాధి శిక్షణ, కర్మాగార, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో సకల జనుల ఆధ్వర్యంలో సన్మానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ముందుగా అంబేడ్కర్ చౌరస్తాలో ఆయనకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ, మహేష్ బి. గీతే, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫంక్షన్ హాల్‌లో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల రాములు అధ్యక్షతన సమావేశం జరిగింది. మంత్రి వివేక్ వెంకటస్వామికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని అందించి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కోరిక మేర కార్మిక క్షేత్రమైన సిరిసిల్లలో జౌళిశాఖ నుంచి కార్మికులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కల్వకుంట్ల కుటుంబం కోసమే పనిచేసిందని ఆరోపించారు. సిరిసిల్లలో ఒకప్పుడు ఇసుక మాఫియా ఉండేదని, ఆ మాఫియాతోనే దళితులు చనిపోయారని, మరికొందరిపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ ప్రాజెక్టుపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. హైదరాబాద్‌కు 20 టీఎంసీల నీరు అందించాలని గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వం రూ 30 వేల కోట్లతో ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టిందన్నారు. ఆ ప్రాజెక్టు కోసం రూ 11 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌజ్ కోసం మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని ఆరోపించారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషి చేస్తున్నాడన్నారు. ప్రభుత్వ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక ధార్మిక క్షేత్రమైన సిరిసిల్ల జిల్లాకు కార్మిక మంత్రిగా వివేక్‌వెంకటస్వామి మొదటిసారిగా వచ్చారని, జౌళిశాఖపై అవగాహన ఉన్న వివేక్‌వెంకటస్వామి సిరిసిల్ల కార్మికులకు అండదండలు అందించాలని కోరారు. నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆవశ్యకతను నాడు ఏఐసీసీని మెప్పించి ఒప్పించిన వారిలో మొదటివాడు కాకానే అని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, సబేరా బేగం, విజయతిరుపతి, రాణి, రాములు నాయక్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, పట్టణ ఉపాధ్యక్షుడు బొప్ప దేవన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కామిని వనిత, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, కత్తెర దేవదాస్, రొడ్డ రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న నాయకులు

ధర్మపురిలో ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో గణపతి ఉపనిషత్‌లతో బుధవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు, హారతి, మంత్ర పుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, స్థానిక వేదపండితులు మధు రామశర్మ, కాకెరి గోపాల్ శర్మ, జనుమంచి రాములు శర్మ ధర్మ కర్తలు గుడ్ల రవీందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

వేములవాడలో భవనంపై పిడుగుపాటు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో బుధవారం ఓ ఇంటిపై పిడుగు పడింది. పట్టణంలోని భగవంతరావునగర్‌లోని ఓ భవనంపై పిడుగు పడటంతో ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తులు ధ్వంసమయ్యాయి. చిన్నపాటి వర్షం ఉరుములు, మెరుపులతో రావడంతో ఇంటి పైభాగంలోని గోడపై పిడుగుపడి కొంత భాగం కూలిపోయింది. ఇంట్లోని రిఫ్రిజిరేటర్, ఫ్యాన్‌లు ధ్వంసమయ్యాయి. ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి అపాయం జరుగలేదు.

● కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో..

కథలాపూర్ : కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు చిలువేరి గంగనర్సయ్య అనే వ్యక్తి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఇంటి పనుల్లో నిమగ్నమైన గంగనర్సయ్య కుటుంబం పిడుగుపాటుకు ఒక్కసారిగా భయాందోళనలకు గురైంది. పిడుగుపాటుతో ఇంటి పైభాగం పెచ్చులూడి పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

● 8 గేట్లు పైకి ఎత్తి 25 వేల క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీరు వదలడం బుధవారం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 54,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 8 గేట్లు పైకి ఎత్తి 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 19,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కులు వదులుతున్నారు. ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 376.827 టీఎంసీ నీరు రాగా, 309.083 టీఎంసీల నీరు వదిలారు.

శ్రీపాద ఎల్లంపల్లిలో..

పెద్దపల్లి : జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతున్నది. బుధవారం సాయంత్రం వరకు 75,266క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఎస్సారెస్పీ నుంచి 12,500 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 5,252క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 57,514 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. 10గేట్ల ద్వారా 75,266 క్యూసెక్కుల వరదనీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 20.175టీఎంసీలకు గాను, 20.175 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

అన్నపూర్ణకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట : మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.12టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్ 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరులోకి..

బోయినపల్లి : శ్రీరాజరాజేశ్వర జలాశయనికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టు బుధవారం 13,400 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. దిగివ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కులు ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.76 ఉండగా, నీటి సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.940 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

దివ్యాంగులకు అండగా ఉంటాం

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



దివ్యాంగుల నృత్యాలను తిలకిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న మానసిక దివ్యాంగుల పాఠశాలలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసిందని తెలిపారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలో జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 400 మంది దివ్యాంగులకు ఉపకరణాలు, ఇతర సంక్షేమ సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. త్వరలో వాటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. మానసిక వికలాంగులకు సేవ చేస్తున్న సిబ్బందికి కలెక్టర్ల ద్వారా ఓ ఏజెన్సీ ఏర్పాటు చేసి వారికి అవుట్ సోర్సింగ్ ద్వారా జీతాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. పాఠశాల ఇబ్బందులపై మాజీ ఎమ్మెల్యే, ట్రస్ట్ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారని, దీనికి స్పదించిన సీఎం వెంటనే 50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసి ట్రస్టు అకౌంట్‌లో జమచేయించారని తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి శైలజ మాట్లాడుతూ. దివ్యాంగుల సంక్షేమానికి బాల భరోసా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారన్నారు. మాజీ ఎమ్మెల్యే, ట్రస్టు చైర్మన్ చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ 2014 నుంచి మానసిక వికలాంగుల పాఠశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్ రాకపోవడంతో సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేక చాలా ఇబ్బందికరంగా పాఠశాలను నడిపిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను తెలపడంతో వెంటనే స్పందించి 50 లక్షల గ్రాంటును విడుదల చేశారని తెలిపారు. వొకేషనల్ కోర్సుల కోసం మరో 40లక్షల నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. అనంతరం దివ్యాంగుల పిల్లలతో కలిసి మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు కొమ్మురెల్లరెడ్డి, భగవాన్, వెంకటయ్య, ఏవో బాలరాజు, ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

రచయిత డాక్టర్ కిరణ్‌కు 'వడ్డేపల్లి' జాతీయ సాహిత్య పురస్కారం

సిరిసిల్ల సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన రచయిత, కవిగా డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్‌కు అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అందించే డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ జాతీయ సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ కిరణ్ కుమార్ చైతన్య స్ఫూర్తి వంటి సంకలనం, ఓ తండ్రి తీర్పు లఘు చిత్రకథ, కవితలు, వ్యాసాలు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. సుప్రసిద్ధ సినీ గేయరచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ స్మారకార్థం సాహిత్య పురస్కారాన్ని అందిస్తున్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో జరగబోయే ప్రత్యేక కార్యక్రమంలో కిరణ్‌కు అవార్డును ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.



కిరణ్

అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి ఔట్ స్టాండింగ్ ఎడ్యుకేషనల్ అవార్డు



అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

భగత్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డికి ఔట్ స్టాండింగ్ ఎడ్యుకేషనల్ అవార్డు దక్కింది. బుధవారం కళాశాల ఆవరణలో నరేందర్‌రెడ్డిని అధ్యాపకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ స్కూల్ ఆఫ్ అవార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా ప్రతిష్ఠాత్మకమైన అవార్డు రావడం గొప్ప విషయమన్నారు. 35 ఏళ్లుగా అల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యారంగ అభివృద్ధికి సేవలందిస్తున్నట్లు, ఎంతో మంది విద్యార్థులు ఉన్నత రంగాల్లో రాణించేలా దోహదం చేసినట్లు చెప్పారు.

విజయవంతంగా జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సైన్స్ మ్యూజియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ విజయవంతమైందని, ఇందులో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి సెమినార్‌కు పంపిస్తామని జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం 'క్వాంటమ్ యుగం ప్రారంభమైంది... అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ కర్ర అశోక్‌రెడ్డి, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, డీసీఈబీ కార్యదర్శి భగవంతయ్య పాల్గొన్నారు.

నేడు సైదాపూర్‌లో మంత్రి పొన్నం పర్యటన

సైదాపూర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో గురువారం రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నట్లు మంత్రి క్యాంప్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నాయి.

కాంగ్రెస్, బీజేపీల ధర్నా సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చిగురుమామిడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ధర్నా చేయడం సిగ్గు చేటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో యూరియా కొరత ఏర్పడలేదన్నారు. బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి మల్లేశం, మాజీ ఎంపీపీ అకావరం శివప్రసాద్-బావాణి, మండల ప్రచార కార్యదర్శి రాంబాబు, మాజీ ఎంపీటీసీ, జిల్లా యాదవ సంఘం డైరెక్టర్ కత్తుల రమేష్ యాదవ్ ఉన్నారు.

ముజాహిద్ హుస్సేన్‌కు మైనార్టీ సభ్యుల సన్మానం

హుజూరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ జామ మజీద్ అండ్ ఈద్గా మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ సౌదీ అరేబియాలోని మక్కా ఉమ్రాని దర్శించుకునేందుకు వెళ్తుండగా బుధవారం మైనార్టీ సభ్యులు సన్మానించారు. నాయకులు అంజదుల్లాఖాన్, హర్షద్, షఫీ, సల్మాన్, మున్వార్, సుబేర్, షారుఖ్ పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల

శంకరపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఓటర్ తుది జాబితాను ఎంపీడీవో కృష్ణప్రసాద్ బుధవారం విడుదల చేశారు. 13 ఎంపీటీసీ స్థానాలకు జరిగే ఎన్నికల కోసం అన్ని గ్రామపంచాయతీల్లో తుది ఓటర్ జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల జాబితా తయారు చేసినట్లు పేర్కొన్నారు.

యూరియా బస్తాలను దశలవారీగా అందిస్తాం

జమ్మికుంట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): యూరియా బస్తాలను దశలవారీగా సొసైటీకు అందిస్తామని హుజూరాబాద్ ఏడీఏ గుండా సునీత అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని గ్రోమోర్ ఎరువుల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దన్నారు.

జమ్మికుంట రూరల్: రైతులు నానో యూరియా వాడాలని హుజూరాబాద్ ఏడీఏ గుండా సునీత అన్నారు. బుధవారం జమ్మికుంట మాచనపల్లిలో తిరుపతిరెడ్డి అనే రైతు పొలంలో నానో యూరియా పిచికారీ చేశారు.

స్వేరోస్ మండల నూతన కమిటీ ఎన్నిక

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండల స్వేరోస్ నూతన కమిటీని హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్, ఉపాధ్యక్షులు ప్రదీప్‌ల ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడు శివరాత్రి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి శ్రీకర్, ఉపాధ్యాక్షులు అజయ్, అభినయ్, అధికార ప్రతినిధి కార్తీక్, సంయుక్త కర్యాదర్శులు వినయ్, యశ్వంత్ ఎన్నికయ్యారు.

సీపీకి జమాతే ఇస్లామీ హింద్ ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 10: (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19, 20, 21 తేదీల్లో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎక్స్‌పోకు హాజరుకావాలని సీపీ గౌస్ ఆలంకు బుధవారం కార్యాలయంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సారథ్యంలో సంస్థ ప్రతినిధులు ఆహ్వానపత్రం అందజేశారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చెంచాల మురళి అన్నారు. బుధవారం నగరంలోని బస్టాండ్ ఎదుట డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శంకరపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో హెడ్ కుక్ (1), అసిస్టెంట్ కుక్ (1), స్వీపర్ (డ్రై) పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. మండలానికి చెందిన మహిళా అభ్యర్థులై ఉండాలని పేర్కొన్నారు. హెడ్ కుక్ పదో తరగతి, అసిస్టెంట్ కుక్, స్వీపర్ 7వ తరగతి చదివి ఉండాలని తెలిపారు. సర్టిఫికెట్లతో ఈ నెల 12న సాయంత్రం 5గంటలకు ఎంఆర్సీలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌లను తగ్గించినందుకు బొమ్మకల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ రైల్వే బోర్డు మెంబర్ పాశం తిరుపతి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిందం అశోక్, సీనియర్ నాయకుడు తిరుపతి, గాలిపల్లి నారాయణ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అద్వితీయ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చాటి ఖో-ఖో బాలికల విభాగంలో చైత్ర, సుభిక్ష, బాలుర విభాగంలో ఆదర్శ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.కబడ్డీలో ఆకాంక్ష, అథ్లెటిక్స్ షాట్‌పుట్‌లో సహస్ర, శ్రేయ, బాలుర విభాగంలో యశస్విన్ ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ మాధురి శ్వేత తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ సొగాని కొమురయ్య, డైరెక్టర్ సొగాని అనుదీప్ అభినందించారు.

దళితులందరూ ఐక్యంగా ఉండాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా దళితులంతా ఐక్యంగా ఉండాలని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం అన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో సంఘం రాష్ట్ర, జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్, రాష్ట్ర ప్లానింగ్ కమిటీ చైర్మన్ గజ్జెల ఆనంద్‌రావు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం



నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. బుధవారం చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా ప్రతిమ జంక్షన్‌లోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తెలంగాణ మహనీయుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తోందని, వారి సేవలను మననం చేసుకోవాలని కోరారు.

సుభాష్‌నగర్: కలెక్టరేట్ రోడ్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్, జిల్లా అధ్యక్షుడు రాచకొండ నరేష్ నివాళులర్పించారు. కొల్లూరి కుమార్, కొత్తకొండ రాజయ్య, గంగిపల్లి నరేష్, రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌కుమార్ ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మాజీ కార్పొరేటర్ నాగసముద్రం ప్రవీణ్, యువమోర్చా జిల్లా నాయకుడు మునిగంటి కుమార్, పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ ఉప్పరపెల్లి శ్రీనివాస్, యువమోర్చ ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మకు నివాళి అర్పించారు. ఎంపీడీవో సంజీవరావు, మాజీ సర్పంచ్ రుద్ర భారతి రాములు ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలో తహసీల్దార్ సురేఖ, ఎస్ఐ శేఖర్‌రెడ్డి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాజిరెడ్డి, ఎంపీహెచ్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్ పాల్గొన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని చాణక్య డిగ్రీ, పీజీ కళాశాలలో రజక సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి దబ్బెట రవీందర్, కళాశాల డైరెక్టర్ శివ, ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: రేకొండలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేకొండకు చెందిన మండల రజక సంఘం అధ్యక్షుడు దుడ్డెల లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పలువురు రజకసంఘం నాయకులు నివాళులర్పించారు.

ఇల్లందకుంట: రజక సంఘం మండలాధ్యక్షుడు రావుల ఎల్లయ్య ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రామస్వామి, సింగిల్ విండో వైస్ చైర్మన్ కొంరెల్లి, రమణాచారి, పెద్ది కుమార్, దంసాని కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

సైదాపూర్: రజకసంఘం ఆధ్వర్యంలో ఐలమ్మకు నివాళి అర్పించారు.

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. నాయకులు రాచర్ల కుమార్, రవీందర్, రమేష్, అనిల్, సునిల్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లిలో రజక సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. సంఘం నాయకులు సానగొండ సంపత్, సానగొండ సది, పోతుగంటి శ్రీనివాస్, సానగొండ కనకయ్య, నరసింహస్వామి, సంపత్, రాజేశం, కమలాకర్, శ్రీకాంత్, లక్ష్మణ్, అంజయ్య, శ్రీనివాస్, అంజనేయులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

రామడుగు: గోపాల్‌రావుపేటలో రజక సంఘం అధ్యక్షులు పైండ్ల హనుమంతు, సంఘం నాయకులు లింగంపల్లి అంజయ్య, పైండ్ల తిరుపతి, పున్న కనకయ్య, పైండ్ల శ్రీనివాస్, పైండ్ల మధు, పైండ్ల రాంచంద్రం, పైండ్ల మల్లేశం, పైండ్ల చంద్రయ్య పాల్గొన్నారు.

శంకరపట్నం : శంకరపట్నం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధి అలివెల్లి సమ్మిరెడ్డి, దండు కొంరయ్య, నరేందర్, సంపత్, సారయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలలో పోషకాహార వారోత్సవాలు



వారోత్సవాలను ప్రారంభిస్తున్న డైటీషియన్ స్ఫూర్తి, కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో జాతీయ పోషకాహార వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి, రెనీ గ్రూప్స్ ఆఫ్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ డైటీషియన్ స్ఫూర్తి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, ఫైబర్, సూక్ష్మపోషకాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులూ.. యూరియా ఇప్పించరూ..

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని కోరింది.ఇప్పటి వరకు 28,921 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే జిల్లాకు వచ్చింది. దీనితో యూరియా కొరత తీవ్రంగా ఏర్పడింది.

● ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్ కొరతకు ఓ కారణం

పెద్దపల్లి జిల్లాలో రామగుండం యూరియా ఉత్పత్తి కేంద్రం ఉన్నా ఈ సీజన్‌లో రెండుసార్లు మరమ్మతుకొ షట్‌డౌన్ అయ్యింది. 20 రోజులుగా ఉత్పత్తి నిలిచిపోయింది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే యూరియాను రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు కేటాయించినా ప్రధానంగా ట్రాన్స్‌పోర్టు చార్జీలు తక్కువగా ఉండే వీలుండడంతో ఎక్కువ కోటాను ఉత్తర తెలంగాణ జిల్లాలకు కేటాయిస్తారు. ఇప్పుడు ఉత్పత్తి నిలిచిపోవడంతో ఇక్కడికి ఇతర కంపెనీల నుంచి యూరియా రావలసిన పరిస్థితి ఉన్నది. ఆయా ఫ్యాక్టరీలకు, కంపెనీలకు వారికి కేటాయించిన ప్రాంతాల కోటా కూడా ఉండడం, ఇక్కడి ప్రజాప్రతినిధుల నుంచి అవసరమైన ఒత్తిడి లేకపోవడంతో ప్రత్యేకంగా ఇక్కడికి యూరియా రావడం లేదని అనుకుంటున్నారు. బీజేపీకి చెందిన ఎంపీ బండి సంజయ్‌కుమార్ కేంద్రమంత్రిగా, ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు రాష్ట్ర మంత్రులు ఉన్నా సమస్య తీరక పోవడంపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమవుతోంది.

శ్రీ చైతన్య డిఫెన్స్ అకాడమీలో మెడికల్ క్యాంప్

తిమ్మాపూర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ శ్యాం సుందర్ రెడ్డి తెలిపారు. సుమారు 276 మంది విద్యార్థులు ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌లో పాల్గొని పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు కరీంనగర్‌లోని మాక్స్ విజన్ ఐ హాస్పిటల్, మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు 18రకాల పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి మాట్లాడారు. డీన్ జగన్మోహన్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, పీడి.లెంకల మహిపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కోచ్‌లు, ఆసుపత్రి వైద్యులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టూ ఏడీఈ లావణ్య తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11వరకు ఫైర్ స్టేషన్ ఏరియా, 2 టౌన్ పోలీస్ స్టేషన్, ఫండస్ స్కూల్, విఘ్నేశ్వర హాస్టల్, ఆర్‌బీ స్వీట్ హౌస్, అన్వర్ హోటల్, శ్రీరామ బుక్‌స్టాల్, గోపాల్ రావు బిల్డింగ్ ఏరియా, వాణి సూపర్ మార్కెట్, జాఫ్రీ మసీద్, జిల్లా గ్రంథాలయం. వాణినికేతన్ కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యుత్ శాఖలో ముగిసిన శిక్షణ తరగతులు

గణేశ్‌నగర్,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ బెంగళూరు ఆధ్వర్యంలో కరీంనగర్ సర్కిల్‌లోని 40 మంది ఇంజనీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. పీఎం సూర్యఘర్ మఫ్త్ బిజిలీ యోజన పథకంపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎస్ఈ రమేష్‌బాబు తెలిపారు. అనంతరం అధికారులకు సర్టిఫికెట్లు అందజేశారు. రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్, రిటైర్డ్ ఎస్ఈ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ రీప్లేస్‌మెంట్‌కు భయపడొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు వేణుగోపాల్, రాకేశ్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మోకాళ్ల నొప్పులతో బాధపడే వారు జాయింట్ రీప్లెస్‌మెంట్ చేయించుకోవడానికి భయపడాల్సిన అవసరం లేదని మెడికవర్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రాకేశ్ అన్నారు. బుధవారం నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శరీరంలోని ఇతర భాగాలకు చేస్తున్న సర్జరీల మాదిరిగానే మోకాలు, తుంటి సర్జరీలకు అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. 50 ఏళ్లు దాటిన వారిలో మోకాలు కీలు అరుగుదల సహ జమని, ఇందులో నాలుగు స్టేజీలు ఉంటాయని తెలిపారు. ఎంఆర్ఐ పరీక్ష ద్వారా కీళ్ల అరుగుదల ఏ స్టేజీలో ఉన్నదో తెలు సుకునే అవకాశం ఉం టుందన్నారు. టోటల్ తుంటి జాయింట్ రీప్లేస్ మెంట్‌తో 90శాతం సక్సెస్ రేట్ ఉందన్నారు. పేయిన్‌లెస్ సర్జరీలు అందుబాటు లోకి వచ్చాయన్నారు. మోకాలు అరుగుదల సమస్యలు ఉంటే స్పెషలిస్టు వైద్యు లను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, అనే స్థిషియా హెడ్ డాక్టర్ వినయ్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేద్కర్ స్టేడియం కరీంనగర్ రూరల్ మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను బుధవారం ఎంఈవో రవీందర్ ప్రారంభించారు. జిల్లా యువజన, క్రీడాధికారి శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, మండల కార్యదర్శి రమేష్, పీడీలు సౌజన్య, స్వాతి, శ్రీనివాస్, సంతోష్, అశోక్, గౌతమ్ రెడ్డి, వినయ్ పాల్గొన్నారు.

చొప్పదండి: మండలస్థాయి బాలికల ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలను బుధవారం చొప్పదండి బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైద్యుల రాజిరెడ్డి ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ వేణుగోపాల్, ఎంఈవో మోహన్, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

● సంక్షిప్తంగా..

ఇల్లందకుంట: మండలంలోని పాతరపల్లి, కనగర్తి, సిరిసేడు, సీతంపేట, శ్రీరాములపల్లి ప్రజల సౌకర్యార్థం ఎంపీ నిధులతో ఏడు బోర్లు వేశారు. బుధవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషితో మోటార్లు బిగించారు. బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రామడుగు : జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నను పలువురు నాయకులు పరామర్శించారు. ఆమె బావ అనారోగ్యంతో మృతిచెందారు.

- రామడుగు ఎంఈవో రంగనాథ శర్మను మండలంలోని ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్స్ బుధవారం ఘనంగా సత్కరించారు. గోపాల్‌రావుపేట హెచ్ఎంగా, ఎంఈవో బాధ్యతలు నిర్వర్తించిన అంబటి వేణు కుమార్ ఆగస్టులో ఉద్యోగ విరమణ పొందగా రుద్రారం హైస్కూల్ హెచ్ఎం రంగనాథ శర్మకు అదనపు బాధ్యతలు ఇచ్చారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని ఆలయాల్లో బుధవారం సంకటహర చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గణేశ్‌నగర్ : కరీంనగర్ టౌన్ డివిజన్‌లోని జ్యోతిబాపూలే మైదానంలో నిర్మిస్తున్న ఇండోర్ సబ్ స్టేషన్ పనులను ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్‌రావు, చీఫ్ ఇంజనీర్ తిరుమల రావు పర్యవేక్షించారు.

కరీంనగర్ టౌన్: తెలంగాణ రాష్ట్ర ఎల్ఎస్ఎస్, లైసెన్స్ సర్వేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా దుర్గం శివకుమార్ నియామకమయ్యారు. అసోసియేషన్ వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ చాగంటి నియామక పత్రాన్ని అందజేశారు.

కరీంనగర్ స్పోర్ట్స్: ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో బుధవారం విద్యాధరి ఉన్నత పాఠశాలలో కరాటే బెల్టుల గ్రేడింగ్, బెల్టుల ప్రదానోత్సవం నిర్వహించారు. చైర్మన్ వెంకటేశ్వర్ రావు, ఒకినోవా సంస్థల చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన పశువుల షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బుధవారం ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్ రావు చెక్కులను అందజేశారు.

శంకరపట్నం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికుల స్కావెంజర్స్‌కు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధుకమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆటోనగర్‌లో విద్యుదాఘాతానికి గురై ఉన్నేజు రమేష్(53) దుర్మరణం చెందాడు. వన్ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం... కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన రమేష్ కరీంనగర్ ఆటోనగర్‌లో లేత్‌మిషన్ నడుపుతున్నాడు. బుధవారం లేత్‌మిషన్‌పై వర్క్ చేసుకుంటుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడుపోలీసులు కేసు నమోదు చేశారు.

జ్యోతిబా పూలే కూడలి సుందరీకరణకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ఎదుట జ్యోతిబా పూలే కూడలి సుందరీకరణ పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సుడా వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రూ.15 లక్షలు సుడా నిధులతో సుందరీకరణ పనులు ప్రారంభిం చినట్లు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు దన్న సింగ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయ కులు ఎండీ చాంద్, మల్లికార్జున్, వరాల నర్సింగం, తిరుమల, ఊరడి లత, సుతారి లచ్చన్న, నాగి అశోక్, స్వప్న, శ్రీధర్ రెడ్డి, కిరణ్ రెడ్డి, పెరుక రాజేందర్, వెంకన్న, బూర్గుపల్లి రవీందర్, పిట్టల నర్సయ్య, పీఎల్ నర్సయ్య పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మానేరు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అనంతరెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అర్బన్ స్థాయి అథ్లెటిక్స్‌లో మానేరు పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన సీహెచ్ అభిజ్ఞ 3కిలో మీటర్ల రేస్ వాక్‌లో స్వర్ణం, వి.అభిరానందన్ 3 కిలోమీటర్ల రన్నిం గ్‌లో రజతం, కె.సాత్విక 800 మీటర్ల రన్నింగ్‌లో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం పాఠశాల లో విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. ప్రిన్సిపాల్ కడారి సునీతారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, పీఈటీలు సిలివేరి మహేందర్, తిరుపతి, స్వామి, జహేద ఉన్నారు.

అపన్నులకు అండగా సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వంద మందికి 19వ విడుతలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 33.31లక్షలు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం. ఓదెలు, వైస్ చైర్మన్ ఆర్. తిరుమల్‌రెడ్డి, తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎంపిడివో వరలక్ష్మీ, మండల అధ్యక్షులు ఎన్. రవీంద్రాచారి, ఎం. ప్రేమ్‌కుమార్, కె. అశోక్, టి. నరేష్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో తెలుగు భాషాదినోత్సవం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం తెలంగాణ తెలుగు భాషా, సాహిత్య దినోత్సవం నిర్వహించారు. ప్రధానపాధ్యాయుడు రఘురాం, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ దత్తపుత్రుడు 'విశ్వనాథ'

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 10: జ్ఞానపీఠ పురస్కార గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ కరీంనగర్‌కు దత్త పుత్రుడి వంటి వారని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు అన్నారు. బుధవారం ఎస్ఆర్ఆర్ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో విశ్వనాథ జయంతి నిర్వహించారు. అనంతరం లక్ష్మణరావును సన్మానించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ, డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, నీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలుగు పద్యకవితా సదస్సు ఆధ్వర్యంలో ఐకాన్ కోచింగ్ సెంటర్‌లో విశ్వనాథ జయంతి నిర్వహించారు.

చల్మెడలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు వైద్య కళాశాలలో బుధవారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆత్మహత్య నివారణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అసీం అలీం, సైకియాట్రి ప్రధాన విభాగాదిపతి, డాక్టర్ పవన్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, పీడీయాట్రిక్స్ హెచ్‌వోడి డాక్టర్ రమ్య, క్యాన్సర్ డాక్టర్ సంజయ్, వైద్యులు నిఖిల్, వినాయక్ ఉన్నారు.

తప్పని యూరియా కష్టాలు



మహిళా రైతులతో మాట్లాడుతున్న ఎస్సై తిరుపతి

సైదాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొసైటీ గోదాం వద్ద మహిళా రైతులు బుధవారం ఉదయం నుంచి చెప్పులు లైన్లో పెట్టి వేచి చూశారు. టిఫిన్ బాక్స్ తెచ్చుకొని అక్కడే భోజనం చేశారు. సాయంత్రం వరకు యూరియా కోసం చూసినా లోడ్ రాక పోవడంతో నిరసనకు దిగారు. వెంటనే సరిపడా యూరియా తెప్పించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందు కున్న సైదాపూర్ ఎస్సై సీహెచ్ తిరుపతి రైతులకు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు.

వీణవంక: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం వద్దకు యూరియా వచ్చిందనే సమాచారంతో రైతులు ఉదయన్నే భారీగా చేరుకున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో ఒక్కో రైతు ఒక యూరియా బస్తా పంపిణీ చేశారు. ఎస్సై తిరుపతి బందోబస్తు చేపట్టారు.

గంగాధర : కురిక్యాల సొసైటీ వద్ద అదే గ్రామానికి చెందిన రైతు సాయిల్ల రాజమల్లు అస్వస్థతకు గురయ్యాడు. సొసైటీ పరిధిలో యూరియా కోసం రైతులకు కూపన్లను అందిస్తున్నారు. రైతు లైన్‌లో నిలబడి స్పృహతప్పాడు. వైద్య పరీక్షలు నిర్వహించగా ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు రైతులు తెలిపారు.